# అసమర్థుడి
# అర్ధరాత్రి యాత్ర



ఋతుక్రమం ఆలస్యమైతే?

SEENU & CO. MADRAS-21

పెద్ద కెమిస్టులు, డ్రగ్గిస్టులు అందరి వద్దను లభిస్తున్నది
ప్రకటన G. O. Ms. No. 1121 క్రింద అనుమతించబడినది

మీరు మెచ్చిన
రీటా
సరికొత్త ప్యాకింగ్ లో
వస్తున్నది




ఒకరి శిరోజ సౌందర్యంచూచి మరొకరు ఇక ఎంతమాత్రం అసూయపడవలసిన అవసరం లేదు. రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధిచేసుకోండి.

మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా వుండవలెనంటే ఇంతకుమించి చేయవలసిందేమీ లేదు.

రీటా ప్రతిచోటా దొరకును

రీటా కేశసంపద

బలహీనత అవుతుంది' అనుకున్నాడు వీర్రాజు. వెంటనే అడుగులు చప్పుడు కాకుండా నెమ్మదిగా వేసుకొంటూ, గుండెల చప్పుడును కూడా తగ్గించి, శ్వాస బిగపట్టి బెడ్‌లైట్ ఆర్పివేశాడు. మంచం తల దిండుకింద ఉన్న తాళంచెవులు తీసి బీరువాలోకి చూశాడు. ఆ చీకటిలో తను చేస్తున్న పని తన ఆత్మ కూడా చూడ లేదని నమ్మకం వీర్రాజుకు.

ఓ పదినిమిషాల తరవాత బజారులో పడ్డాడు. అతని శరీరమంతా చెమటతో తడిసింది. గుండెలు చాలా వేగంగా కొట్టుకొంటున్నాయి. కాళ్లవేళ్లనుంచి తల వరకు మొత్తం శరీరం గజగజ వణుకుతూంది. అలాగే నడుచుకొంటూ కొంతదూరం నడిచి ఓ కునికి పాట్లు పడుతున్న లైటుకాంతిలో జేబులోఉన్న కాగితాలను తీసి ఆదుర్దాగా చకచక లెక్కించాడు.

మొత్తం ఐదువేలు. . . .

జీవితంలో మొదటిసారిగా అంత మొత్తాన్ని చూచిన తరవాత తను కూడా మనిషిగా బ్రతకవచ్చును కున్నాడు. తనను మనిషిగా మార్చాలని నవ్వుకొంటున్న తనలోని ధైర్యాన్నికంటె, అటువంటి పని చేయటం పాపం అని అంతకుముందున్న భావంకంటె, ఆ ఐదువేల రూపాయలు చాల మంచివిగాను, బలమైనవిగాను అగుపించాయి ఆ క్షణంలో వీర్రాజుకు.

ఒక్కసారి ఈ ప్రపంచాన్ని చూచి, రకరకాల రంగులు ముఖాలలో నింపుకున్నా మనుష్యులను చూచి నవ్వాలనిపించింది అతనికి. ఆ సమయంలో దేవుడు కనబడినా ఓ వంద రూపాయలు లంచమిచ్చి మరో జన్మలో లక్షాధికారిగా పుట్టించమని అడగాలని పించింది.

జేబునిండా డబ్బు ఉండేసరికి ప్రపంచం తన చుట్టూ పరుచుకున్నట్లుగా ఉంది. అంతకుముందు చాలా విశాలంగాను, అతని ఊహకు అందకుండాను ఉండేది. చుట్టూఉన్న ప్రపంచాన్ని చూచి "నేను కూడా మనిషినయ్యాను" అని గట్టిగా అరిచి పకపక నవ్వాలను కున్నాడు. ఆ నవ్వు ఎందుకని మరల ప్రపంచం అడిగితే తడబడిపోతాడు వీర్రాజు జవాబు ఇచ్చుకోలేక.

వీధి మలుపు చివరివరకు వెళ్ళిన తరవాత అతనికి దడ ఎక్కువయింది. అడుగులు బరువుగా, కంగారు పడుతున్నాయి. తన నేరాన్ని గమనించి ఎవరో వెంట నడిచినట్లుగా ఉంది. వెనక నిలబడి తన జేబువంక చూస్తున్నట్లుగా ఉంది. జేబుమీద చేయివేసి తడిమి చూసుకొని వెనక్కి తిరిగి చూశాడు.

గుండె ఝల్లుమంది.

అతని నీడ అతనిలాగానే వంకరగా నిలబడి ఉంది.

మరి నాలుగు గజాలు ముందుకు వెళ్ళి ఆగిపోయాడు. తన చొక్కా పట్టుకొని వెనకకు గుంజి వీపుమీద ఎవరో ఛెళ్ళున చరిచినట్లుగా ఉంది. వెనుతిరిగి చూశాడు.

అనుభవం జీవితం మీద ముద్రవేసి భయంకరంగా నవ్వుతూంది. మరికొన్ని గజాలు ముందుకు వెళ్లాడు. ఎవరో చెయ్యి పట్టుకొని వెనక్కి లాగారు. ఆ చేయి వదిలించుకోవాలని ప్రయత్నం చేశాడు కాని వ్యర్థమై పోయింది. కొంచెం ధైర్యంగానే వెనుతిరిగి కనులు పెద్దవి చేసి చూశాడు.

అనుభూతి తిట్టుకొంటూ ఏదో గొణుక్కొంటూ

ఉంది.

శరీరాన్నించి చెమటలు కారసాగాయి. ఒంటరిగా ఉంటే ఇవన్నీ తనను బ్రతకనివ్వవని ప్రపంచంలో చొరబడాలని పరుగెత్తసాగాడు. కొంచెం దూరం పరుగెత్తగానే చెవులు గింగురుమనే శబ్దం మ్రోగి వీర్రాజు గుండెలలోకి దూసుకుపోయింది.

అడుగుల వేగం ఆగిపోయింది.

వేగంగా కొట్టుకొంటున్న గుండెలను ఒక చేత్తో పట్టుకొని, మరొక చేతితో చెమటను తుడుచుకొంటూ ఆ శబ్దాన్ని ఆలకించసాగాడు.

ఆత్మ ఎందుకో వెక్కివెక్కి ఏడుస్తూ ఉంది. అదే శబ్దం. వీటినన్నిటిని తప్పుకొని చాలా వేగంగా పోగినంతవరకు పరుగెత్తి మెయిన్‌బజారులో పడ్డాడు వీర్రాజు. రోడ్డుమీద కొద్దిమంది అటు ఇటు తిరుగుతున్నారు. లైట్లకాంతి రోడ్డును పూర్తిగా ముంచివేస్తూంది. సందడిలోపడిన తరవాత అతనికి కొంత ధైర్యం వచ్చింది. తేలికగా శ్వాస పీల్చుకున్నాడు. ఆ శ్వాసలో నమ్మకం కూడా బయటకు వచ్చింది. తను ఐదువేల రూపాయలకు అధికారి అని, తను మనిషిలా బ్రతకగలడని నమ్మకం ఏర్పడింది.

అయితే ఈ అయిదువేలు అయిపోయిన తరవాత? అసలు ఈ ఆలోచన అతనికి రానేలేదు. అంతకుముందు బ్రతకటంకోసం బ్రతుకుతున్నట్లుగా ఉంది. అయిదువేల రూపాయలు జేబులో ఉండేసరికి ఇంక మరేదో ఉద్దేశంతో బ్రతుకుతున్నట్లుగా ఉంది వీర్రాజుకు.

జేబుమీద చెయ్యివేసి ఓసారి తడుముకొని నడుస్తున్నాడు. వెంటనే ఆకలి గుర్తుకు వచ్చింది. రాత్రి పన్నెండు గంటలవేళ వీర్రాజుకు తినటానికి ఏమీ దొరకవు. ఆ టైములో ఏ హోటలు ఉండదు.

కాని ఏం చెయ్యాలి?

తన దగ్గర చాలా డబ్బు ఉన్నదనుకొంటున్న కొలది ఆకలి ఎక్కువ అవుతూంది. డబ్బు మనిషి ఆకలిని పెంచుతుందో, తగ్గించుతుందో ఆలోచించసాగాడు. రోడ్డు చివరక పెట్రోమాక్సు లైటు ఒకటి వెలుగుతూంది.

అది చిన్న కాకాహోటలు. రోడ్డు చివరఉన్న మర్రిచెట్టు ప్రక్కన ఉంది. ఆ చెట్టుకింద చాల మంది కాలంతోబాటు మిగిలిన మనుష్యులను మరచిపోయి మూడుముక్కలాట ఆడుతూంటారు. వీళ్లను న్యాయం ఏమీ అనలేదు. న్యాయం కూడా ఇటువంటి దృశ్యాలను కొన్ని చూచి తన పాతజీవితాన్ని గురించి మనికిరాని ఆశయాన్ని గురించి తలచుకొని ఏడుస్తూంటుంది. న్యాయానికి చిన్న తెరవేసి, ఆ ఏడ్పును తెరనుంచి పైకి రానీయకుండా చేయటం అక్కడివాళ్లకు అలవాటు. వాళ్లే ఈ కాకాహోటల్‌ను పోషించుతారు.

వీర్రాజు ఆ హోటల్ ముందు ఆగాడు. గాజు బీరువాలో కొన్ని తినుబండారాలు అగుపడుతున్నాయి. వాటిని చూడగానే వీర్రాజుకు ప్రాణం లేచివచ్చినట్లయింది. ఈ హోటళ్లవాళ్ళు మనుష్యుల కూడా ఈగలు, దోమలులాంటి వాళ్లనుకొని ఆకర్షించుకోటానికి తినుబండారాలన్నీ అందంగా అలంకరించుతారు. వాటిని కడుపారా తినాలనిపించింది వీర్రాజుకు. ఒక్కసారి తృప్తిగా తిని బయటకు రావాలనుకున్నాడు,




## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# కీలక దీపావళి కథల పోటీ

ప్రతిసంవత్సరంవలెనే ఈ కీలక దీపావళి సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తుంది.

ప్లవంగ దీపావళి కథల పోటీలో 3,000 రూపాయల బహుమతులు అందజేశాము. రచయితలకు, రచయిత్రులకూ ఇతోధికమైన ప్రోత్సాహం కలిగించాలనే సంకల్పంతో ఈ సంవత్సరం దీపావళి కథల పోటీకి 4,000 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలు, రచయిత్రులూ ఈ అవకాశం వినియోగించుకొనవలెననీ, పాఠకులకు ఉత్తమమైన కథలు అందజేయాలనే మా కృషి విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలనీ కోరుతున్నాము.

మొదటి బహుమతి రూ. 2000
రెండవ బహుమతి రూ. 1500
మూడవ బహుమతి రూ. 500

### దీపావళి కథల పోటీ నిబంధనలు

1. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
2. స్వీయ రచనలేకాని, అనువాదాలు పంపరాదు.
3. రచన అరఠావు (12×8 అంగుళాలు) సైజులో 12 పేజీలకు మించరాదు.
4. సిరాతో కాగితానికి ఒక పక్కనే వ్రాయాలి.
5. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవానిని ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. పోటీకి పంపిన కథలను ఏ సందర్భంలోను తిప్పిపంపించడం జరగదు.
8. ప్రచురణకు ఏ కలం పేరో ఉపయోగించినా తన అసలు పేరును విధిగా వ్రాయాలి.
9. రచనలను 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2' కు పంపాలి.

బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము

కీలక దీపావళి కథల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరు తేది — **1968 ఆగస్టు 5**

డబ్బును మరోసారి తడుముకొని.

చీకటిలో ఆత్మను, ధర్మాన్ని మోసగించి పది నిమిషాలు కష్టపడి సంపాదించినదానిలో చాలా తృప్తిగా ఉన్నట్లుగా అనిపించింది అతనికి.

హొటల్‌లోకి వెళ్ళపోతున్న అతని కాళ్ళు ఒక్కసారి ఆగిపోయాయి.

"బాబూ" అన్న కేక పక్కనుంచి వినబడింది.

పక్కకు తిరిగి చూశాడు. బిచ్చగాడు ఒకడు నిల్చుని ఉన్నాడు. అంతకుముందు వీర్రాజుకు వాడు చాలాసార్లు కనబడ్డాడు. అప్పుడు వీర్రాజుకు వాడు తనలాంటి మనిషిలా కనబడ్డాడు. అయితే ఇప్పుడు బిచ్చగాడిలానే అగుపడుతున్నాడు.

ఏమిటన్నట్లు చూశాడు వాడివంక. ఆ చూపులో ఉన్న గర్వం ఆ బిచ్చగాడిని కొన్నివేలమంది ముందు కొన్నివేల సార్లు అనుభవమయి ఉంది.

"పదిపైసలు ఇప్పించండి బాబూ, ప్రొద్దుటినుంచి తిండిలేదు."

జేబులో చేయి పెట్టాడు వీర్రాజు. కాగితాలు చాలా మెత్తగా తగిలాయి. వాటిలో ఒకటి తీసి ఇద్దామను కున్నాడు. అయితే వాడు పలికిన ఒక్క వాక్యానికే కాగితం దానంగా ఇవ్వటానికి అతని మనసు అంగీకరించ లేదు.

"నువ్వు బిచ్చగాడివి ఎందుకయ్యావురా?"

బిచ్చగాడి ముఖంమీద నవ్వు నీరసంగా వెలిగింది. గడ్డం దట్టంగా పెరిగి, ముఖంమీద పడిన ముడుత లలో ఎంతో అనుభవం దాచుకున్నాడు వాడు. ఆకస్మాత్తుగా ఎదురుగా నిలబడిన మనిషి అడిగే ప్రశ్న విని వాడు నవ్వుకున్నాడు. వెంటనే అన్నాడు కూడ.

"బాబూ, బిచ్చగాళ్ళ కావాలని అవరు. భగవంతుడే సృష్టిస్తాడు" అది మనుషులలో ఒక జాతి అని అర్థం వచ్చేట్లుగా చెప్పాడు వాడు.

"పుట్టించేటప్పుడే భగవంతుడు ఇలా చేయరా అని రాస్తాడా ఏమిటి?" వీర్రాజు ఈ ప్రశ్న అడగాలను కోలేదు. అయినా అడిగేశాడు.

"అంతేబాబూ. పూర్వజన్మ సుకృతాన్నిబట్టి కూడా ఈ జన్మలో పుడతాము."

ఈ వేదాంతం ప్రతి బిచ్చగాడి దగ్గిర ఉంటుందను కున్నాడు వీర్రాజు. ఇంకా ఆలోచించసాగాడు. పుట్టిన తర్వాత ఈ బిచ్చగాళ్ళ, దొంగలు, ఖూనీకోర్లు, హైటే జీవాలుగా ఎందుకు మారుతున్నారో అర్థం కాలేదు అతనికి. ఇందులో ఏదో రహస్యం కూడా ఉందనిపించింది.

కొన్ని రహస్యాలు మనిషికి అర్థంకావు. అర్థంకాని కొన్నిటివెంట మనిషి గుడ్డిగా పడతాడు.

బిచ్చగాళ్లను మనుషులే తయారు చేస్తున్నారు అనే నిశ్చయానికి వచ్చేశాడు వీర్రాజు. అయితే విలువలు, ( ఆత్మికంగా ఉన్నవి ) అవకాశాలు, మామూలు మనుషులకు వీళ్లకు తేడాగా ఉన్నట్లుగా ఉంది. 'లేకపోతే పదిపైసలుకోసం తాత్కాలికంగానైనా ఆత్మాభి మానాన్ని ఎందుకు అమ్ముకుంటాడు?' అనిపించింది వీర్రాజుకు.

"నీకు అడుక్కోటంలో అభిమానం పోటం లేదురా?"

"బ్రతుకే పోతుంటే ఇంకా అభిమానం ఏంటి



# సుందర ఆరామమైన దేవాలయం

కలకత్తా మహానగరంలోని అసంఖ్యాక జైన దేవాలయాలలోకెల్లా, సుందర ఆరామంలో వెలసిన దేవాలయం ప్రధానమైంది. ఇది జైనతీర్థంకరులలో పదవవాడైన శీతలనాథునిపేర వెలసిన ఆలయం. నూరు సంవత్సరాల క్రితం నిర్మితమైన ఈ దేవాలయం, జనసంకీర్ణనగరంలో ఒక అందమైన తోటలో ఉండడం విశేషం.

ఈ దేవాలయనిర్మాత రావ్‌బద్రిదాస్ బహదూర్ ఉత్తరభారతంలో శ్రీ మాల్‌వంశంలో జన్మించాడు. ఈయన పుట్టుకతో శ్రీమంతుడు కాకున్నా, తన నిజాయితీతో, వివేకంతో, అనతికాలంలోనే సంపన్నుడు కాగలిగాడు. ఈయన నగరంలోని ప్రముఖ సగలవర్తకుడే కాదు, 1871 లో గవర్నరుజనరల్‌కు ముఖ్యుడైనాడు.

## ఆలయ చరిత్ర:

ఈ దేవాలయచరిత్ర ఆసక్తిజనకంగా ఉంటుంది. పూర్వం ఈ ప్రాంతంలో ఒక జైనమందిరం ఉండేదిట. అక్కడకు దాదాబరి మొదలుగాగల ప్రముఖజైనాచార్యులు వచ్చేవారుట. శ్రీ బద్రిదాస్, వారి దర్శనార్థం ఇక్కడకు తరుచు వస్తుండేవాడు. ఒక రోజు, ఆ పరిసరతటాకంవద్ద జలచరాలకు జరిగిన అన్యాయం చూచి సహించలేకపోయాడు. తల్లి అనతిపై ఆ ప్రాంతాన్ని కొని, దేవాలయం నిర్మించాడు. ఇదే శీతలనాథుని ఆలయంగా గణుతికెక్కింది. శీతలనాథు డంటే జలచరాలను కాపాడేప్రభువు అని అర్థం.

## ఇచటి శిల్ప విన్నాణం:

ఈ దేవాలయ నిర్మాణంలో అనుసరించిన పద్ధతులు అతి నిరాడంబరంగా కానవస్తాయి. ముఖమండపం నుండి, మధ్యమందిరంవరకు పెద్ద డోం ఉంది. పైన చిన్న చిన్న బురుజులున్నాయి. వేటికవే ఒకచిన్న మందిరగోపురంవలె కన్పిస్తాయి. దేవాలయ వెలుపలి భాగం, చలువరాళ్లతో అందంగా అలంకరించారు. దాని శిల్పవైభవం ప్రపంచంలోనే అనితరంగా తోస్తుంది.

దేవాలయఅంతర్భాగం, సౌందర్యసంపదలతో తుల తూగుతుంది. ఒక చోట పనితనంతో అచ్చెరువు చెందుతుండగా, మరో చోట కళాసంపద ముగ్ధుల్ని చేస్తుంది. అవాక్కువగా నిలబడిపోయి, మనల్ని మనమే మరిచి, వాటిలో లీనం అయిపోతాం. కుడ్యాలు, ఉపరిభాగాలు, ఆర్చీలు, స్తంభాలు, ఒకటేమిటి, అలంకరణలన్నీ కళాప్రతిభాన్వితాలే. అన్నీ చలువరాళ్లతో నిర్మించినవే. శిలలపై, అద్దాలపై పనితనం, మరో లోకానికి తీసుకువెళ్ళి, అసహజాలు సహజాలెలాఅయినవి అనిపిస్తుంది. ప్రతి స్తంభంపైనున్న చిత్రరావులు, జైనచరిత్రను, పురాణాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి.

## అఖండజ్యోతి:

దక్షిణపార్శ్వంలో వెలుగుతున్న అఖండజ్యోతుల్ని దర్శించగానే మరీ ఆశ్చర్యం వేస్తుంది. నూరు సంవత్సరాలుగా ఈ జ్యోతి అలా వెలుగుతూనే ఉన్నది. ఆ జ్యోతిపైభాగం ఈనాటికి పొగ చూరలేదు. దేవాలయంపవిత్రత కోల్పోయిన క్షణంలో అది పొగ బారుతుందని భక్తులు చెబుతారు.

ఈ దేవాలయానికి జైనభక్తులేకాక, అసంఖ్యాకంగా యాత్రీకులు, రోజూ వస్తూంటారు ... విదేశీయులకు సైతం ఇది దర్శనీయమే!! ★

సి. డి. కె. మూర్తి

అగుపడటంలేదు. ఆమె దేనిని తనకు అమ్ముతుందో అని ఆలోచిస్తున్నాడు.

హఠాత్తుగా అతని ఆలోచనలకు సంకెళ్ళు పడ్డాయి. ఆమె వీర్రాజుమీద వాలిపోయింది. గుండెలమీద ఆనుకొని తన పెదవులను అతని పెదవులపైపు చాపింది. మెత్తని రొమ్ములు అతని గుండెలను అదుముకొంటున్నాయి. పెదవులలో వేడి వీర్రాజు పెదవులమీద చెంపలమీద చురకలు వేస్తూంది.

— అయినా వీర్రాజులో చలనంలేదు. ఆమె తనను ముట్టేసి ఏమి చేస్తూందో కూడా తెలియటంలేదు. అతని మెదడు ఎక్కడో ఆలోచిస్తూంది. ఆలోచన ఉండగా ముట్టే మరల విప్పటానికి ప్రయత్నిస్తూంది.

ఆమె డబ్బుకోసం శరీరాన్ని, అభిమానాన్ని, స్త్రీత్వాన్ని, చివరకు ఆత్మను కూడా అమ్ముకొనే వికారిణిలా అగుపడింది. వెంటనే బిచ్చగాడు చిల్లర డబ్బులు కోసం ఆత్మాభిమానం అమ్ముకొనేవాడుగాను, గళ్లలుంగీవాలా డబ్బు కోసం మానవత్వాన్ని వదలి రాక్షసత్వాన్ని సంపాదించుకున్నవాడుగాను గుర్తుకు వచ్చారు.

అతనికి డబ్బు లేనప్పుడు మిగిలిన మనుషులంతా మంచివాళ్ళుగాను, తనకంటె అధికమైన విలువలుగల వాళ్ళుగాను అగుపడ్డారు. అయిదువేలకు అధిపతి అయిన తరవాత ప్రతి ఒక్కడూ ఏదో ఒకరూపంలో విలువలు అమ్ముకొనేవాడులా అగుపడుతున్నారు.

వెంటనే వీర్రాజుకు ఆ స్త్రీ పరిష్వంగంతో శరీరం జలదరించింది. తనకంటే అధమురాలుగా అగుపడ్డ ఆమె ఎదట ఒక్కక్షణం కూడ ఉండాలనిపించలేదు. ఆమె కౌగిలినుంచి తప్పుకొని "తినటానికి ఏమైనా కావాలి" అన్నాడు.

ఆమె వాలుగా చూచి నవ్వుకుంటూ లోపలికి వెళ్లింది. టిఫిన్ ప్లేటుతో తిరిగి వచ్చేసరికి వీర్రాజు అక్కడ లేడు. తలుపు మాత్రం అటు ఇటు కొంచెంగా కదులుతూంది.

* * *

బయటికి వచ్చిన తరవాత జీవితంలో ఎప్పుడూ లేనంత తేలికగా శ్వాసపీల్చుకున్నాడు వీర్రాజు. అతని మెదడులో క్రొత్తరకాల ఆలోచనలు, శరీరంలో క్రొత్తరకమైన ఆవేశం కలుగుతూంది. అంతేకాదు ఈ మనుషులంటే నమ్మకం పోయింది. వీళ్లంతా ఏదో నియమాలను, సంస్కారాన్ని తెరలుగా నిలుపుకొని దానివాటున విలువల్ని అమ్ముకొంటున్నారు. అందుకోసం వీళ్లముందు 'నేను బ్రతకలేను' అనుకున్నాడు. ఈ సంఘం, అదిఏర్పరిచిన నియమాలు తనను మోసగించుతున్నాయనిపించింది.

చకచక అంగలు వేసుకొంటూ స్టేషనుకు వెళ్ళాడు. అప్పుడే రైలు వచ్చింది కాబోలు చాలామంది గందరగోళంగా బయటికి వస్తున్నారు. వాళ్లందరిని తోసుకొని చాలా కంగారుగా వెళ్లి ప్లాట్‌ఫారమ్ మీద నిలబడ్డాడు.

ఆ చిన్నస్టేషనులో బండి ఎక్కువసేపు ఆగదు. అది మరల బయలుదేరి పోవటానికి కాబోలు రెండుసార్లు గంట నీరసంగా మ్రోగించారు.

కంపార్టుమెంటు దగ్గరగావెళ్లి నిలబడ్డాడు వీర్రాజు.

అతని మెదడులో సంఘర్షణ కలుగుతూంది. గది, సర్టిఫికెట్లు, తిట్లు, ఆత్మాభిమానం — అన్నీ ఒక్కొక్కటే దొర్లిపోతున్నాయి.

బండి కూత వేసింది.

గార్డు విజిల్ మరోసారి ఊదాడు.

వీర్రాజులో ఆవేగం మరింత హెచ్చింది. ఫుట్‌బోర్డు మీదికి కాళ్ళు వేయటానికి మనసు వెనక ముందు ఊగుతూంది. ఆ ఆటలో వీర్రాజుకు ఒకే ఒక్క అభిప్రాయంకలిగింది, తనేదో తప్పు చేసినవాడిలా పారిపోతున్నాడనిపించింది. తనేమీ తప్పు చేయలేదు. . . . .

బండి కదిలింది.

ఆత్మ విమర్శనకు అవకాశం ఇవ్వక అలాగే నిలబడి బండి కనుమరుగయ్యేవరకు చూస్తూ నిలబడ్డాడు. నిలబడి తన జీవితాన్ని మూడు భాగాలుగా విభజించుకున్నాడు. పేదవాడుగా —నిరుద్యోగిగా ఉన్నప్పుడు, అర్ధరాత్రి చీకటిలో ఆత్మకు కూడా గంతలుకట్టి దొంగతనం చేసి ఏమీ పొందలేని గంటకాలము, ఇప్పుడు. . .

ఈ మూడింటిలో మొదటిభాగం మీద ప్రేమ, రెండవదానిమీద అసహ్యము, మూడవదానిమీద నిశ్చలమైన అభిప్రాయము కలిగింది.

జేబులో చేయిపెట్టి కాగితాలను పైకి తీయకుండా లెక్కపెట్టాడు. అయిదు రూపాయలు తక్కువగా అయిదువేలు!

ఆ అయిదు రూపాయలు?

మరొకడి ఆత్మాభిమానానికి వెలకట్టి యిచ్చాడు.

ఇలా ఆలోచించుతూ ప్లాట్‌ఫారమ్‌వంక చూశాడు. ఓ స్త్రీ తన సూట్‌కేసు ఒక చేత్తో, బెడ్డింగ్‌ను మరో చేత్తో పట్టుకొని —చాలా శ్రమపడుతూ బయటకు వెళుతూంది. వీర్రాజుకు ఆమెను చూడగానే ఏదో ఆశ కలిగింది. వెంటనే దగ్గరికి వెళ్లి అన్నాడు "మేడమ్! కావాలంటే నేను సాయం చేస్తాను."

అతనివంక అందంగా అలంకరించుకున్న ఆమె అదో రకంగా చూచి, తనలోనే నవ్వుకొని సూట్‌కేసు, బెడ్డింగ్ వీర్రాజు ముందు ఉంచింది. వాటిని చేత్తో పట్టుకొంటూ అన్నాడు "వీటిని మీ ఇంటివరకు, ఇంకా ఎక్కడికైనా మోసుకువస్తాను. అందుకు ప్రతిఫలంగా అయిదు రూపాయలు ఇవ్వాలి." ఆ యువతి కాసేపు ఆశ్చర్యంగా చూచి తరవాత 'సరే' అన్నట్లుగా తల ఊపి దారి తీసింది. వీర్రాజు సూట్‌కేసు, బెడ్డింగ్ నెత్తిన పెట్టుకొని ఆమెను అనుసరించాడు.

రెండుమైళ్ళు నడిచి, అయిదు రూపాయలు తీసుకొని తిరిగి వస్తూఉంటే వీర్రాజుకు, ఎంతో తృప్తిగా ఉంది. అడుగులు చాలా తేలికగా పడుతున్నాయి. అంతకన్న తేలికగా ఉంది మనసు.

కొంచెం సేపటికి గేటును గభాలున తీసుకొని లోపలకు వెళ్లాడు వీర్రాజు. తన ఇంటి చుట్టూచేరి చాలామంది గందరగోళం చేస్తున్నారు. వాళ్లందరినీ చీల్చుకుని ఇంటి యజమాని దగ్గిరకు వెళ్లి అయిదువేల రూపాయలు చేతిలో ఉంచుతూ అన్నాడు "ఇది క్రొత్త విలువలు ఇస్తుందనుకున్నాను. కాని క్రొత్త బంహీనతల్ని కొని తెచ్చిపెట్టింది!" ✱



నిగనిగలాడే నల్లని కురుల రహస్యం...

కేశవర్ధిని

కేశవర్ధినిని నిత్యం వాడండి.. అది మీ శిరోజాలను చక్కగా పెంపొందిస్తుంది




* హాజరుగా వాడటానికి కేశవర్ధిని రెడీమిక్స్‌డ్ హెయిర్ ఆయిల్

* శిరోజాలను శుభ్రంగా, సువాసనగా ఉంచేందుకు కేశవర్ధిని షాంపూ.

తయారు చేయువారు :

**Kesavardhini Products,**
**MADRAS-14.**

GPK-1